వర్ష బాధిత జిల్లాల్లో సహాయక చర్యలు చేపట్టండి

● కోవై, నీలగిరి కలెక్టర్లకు సీఎం స్టాలిన్ ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోవై, నీలగిరి జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతున్న సీఎం

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతు పవనాల ప్రభావం తీవ్రరూపం దాల్చడంతో పశ్చిమ కనుమలకు చేరువగా ఉన్న కోయంబత్తూరు, నీలగిరి జిల్లాల్లో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వారికి త్వరితగతిన సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. సచివాలయంలో శనివారం ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీలగిరి జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఆయన మాట్లాడి రెండు జిల్లాల్లో వర్షబాధిత ప్రాంతాల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షబాధితులకు అన్నపానీయాలు, బస సదుపాయం కల్పించడానికి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్నవారికి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కూడా ఉత్తర్వులు జారీ చేశారు. నీలగిరి జిల్లా అవలాంచి ప్రాంతంలో కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించినట్లు స్థానిక అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో రాష్ట్ర విపత్తుల నివారణ బృందం సభ్యులు సహాయక చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. అదే విధంగా భారీ వర్షాలు కురుస్తున్న పశ్చిమ కనుమలకు చేరువగా ఉన్న అన్ని జిల్లాలకు విపత్తుల నివారణ బృందం సభ్యులు బాధితులకు సహాయక చర్యలు చేపడుతున్నారని వివరించారు. కోయంబత్తూరు, నీలగిరి జిల్లాలకు చెందిన కలెక్టర్లతో చర్చలు జరిపిన తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్ నీలగిరి ఎంపీ ఎ.రాజాతోనూ వర్షబాధిత ప్రాంతాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వర్షబాధితులకు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శాసనసభ్యులను కూడా సహాయక చర్యల్లో భాగస్వాములను చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ దాస్ మీనా, రెవెన్యూ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్కే. ప్రభాకర్, రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖ ముఖ్య కార్యదర్శి పి.అముద తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్ తమిళులకు సాయం...

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల ఉద్యమం తీవ్రతరమై అల్లర్లు అధికంగా చోటు చేసుకున్న తరుణంలో ఆ దేశంలో పలుచోట్ల నివసిస్తున్న తమిళులకు సాయపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన జారీ చేశారు. రాష్ట్రానికి చెందిన ప్రవాస తమిళుల సంక్షేమశాఖ బంగ్లాదేశ్‌లోని తమిళులకు సాయపడేందుకు, వారిని సురక్షితంగా స్వదేశానికి తరలించేందుకు భారత రాయబార కార్యాలయం అధికారుల ద్వారా చర్యలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న తమిళుల వివరాలను సేకరించే పనుల్లో అధికారులు నిమగ్నమయ్యారని తెలిపారు. బంగ్లాదేశ్‌లోని తమిళులకు సాయం అందించేందుకు, వారి వివరాలను రాష్ట్రంలోని కుటుంబీకులు తెలుసుకునేందుకు అనువుగా టోల్ ఫ్రీ నెంబర్లను కూడా విడుదల చేస్తున్నామని తెలిపారు. ఆ మేరకు 91 1800 309 3793, 91 80 6900 9900, 91 80 6900 9901 అనే టోల్‌ఫ్రీ నెంబర్లను సంప్రదించి బంగ్లాదేశ్ తమిళులు, రాష్ట్రంలో ఉన్న వారి కుటుంబీకులు తాజా పరిస్థితులు, వారి క్షేమ సమాచారాలను తెలుసుకోవచ్చని స్టాలిన్ వివరించారు.

27న స్టాలిన్ ఢిల్లీ పయనం

రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 27న ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో ఆయన పాల్గొంటారు. అదే సమయంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీని కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకోనున్నారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న భారీ ప్రాజెక్టులకు తక్షణమే నిధులు విడుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, రాష్ట్ర సంక్షేమ పథకాల అమలుకు కూడా నిధులు విడుదల చేయాలని ప్రధానికి ఆయన విజ్ఞప్తి చేయనున్నారు.



గర్వించేలా తమిళ సంస్కృతి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్

పెరంబూర్, జూలై 20: తమిళ సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం ఎల్లప్పుడూ గర్వించేలా ఉంటాయని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. మద్రాసు హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మదురై తముక్కంలో హైకోర్టు మదురై బెంచ్ 20వ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్.. ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్మారకస్థూపాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరించారు. అనంతరం ప్రధాన న్యాయమూర్తి తన ప్రసంగాన్ని తమిళంలో 'వణక్కం' అంటూ ప్రారంభించారు. మదురై 24 గంటలు నిద్రపోని నగరంగా పేరుగాంచిందన్నారు. ఈ నగరంలోనే 'అవ్వయార్ ధర్మం చేయండి... ఆ ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది' అంటూ ప్రజలకు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఈ మాటలు తాను మరాఠీ భాషలో నేర్చుకున్నానని, ఈ సూక్తుల ప్రకారం ఇతరులకు సాయం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. మద్రాసు హైకోర్టు మర్రిచెట్టులాంటిదన్నారు. ఆ చెట్టు నీడన ఉన్న మదురై శాఖలో కూడా న్యాయవాదులు, ప్రజలు కలిసిమెలిసి ఉండడంతో మంచి తీర్పులు వస్తున్నాయన్నారు. న్యాయస్థానాల్లో భాషా సమస్య నెలకొన్న సమయంలో, ఆయా ప్రాంతీయ భాషల్లో ఉత్తర్వులు వెలువరించేలా చర్యలు చేపట్టామన్నారు. 2 వేలకు పైగా ఉత్తర్వులు ఆయా ప్రాంతీయ భాషల్లో వెలువరించినట్లు తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మహాదేవన్ మాట్లాడుతూ... మదురై నగరానికి ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. పాండ్య రాజులు నెలకొల్పిన ధర్మాన్ని మదురై హైకోర్టు బెంచ్ పాటిస్తోందన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశ్వనాథన్ మాట్లాడుతూ... నేరం ఎలా జరిగిందో పరిశీలించి ఎలాంటి పక్షపాతం లేకుండా తీర్పు ఇవ్వడంతోనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా హైకోర్టు మదురై బెంచ్ కొత్త శిలాఫలకాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎంఎం సుందరేశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంకా సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్, సూర్యకాంత్, విశ్వనాథన్, మద్రాసు హైకోర్టు ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి కృష్ణన్‌కుమార్, హైకోర్టు మదురై బెంచ్ నిర్వహణ న్యాయమూర్తి సురేష్‌కుమార్ తదితరులు కూడా ప్రసంగించారు.

రామేశ్వరంలో ఆగని పెనుగాలులు

● చేపలవేటకు వెళ్లని జాలర్లు
● రూ.5 కోట్లకు పైగా నష్టం


పడవల రాకపోకలు లేక బోసిపోయిన రామేశ్వరం రేవు ప్రాంతం

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా రామేశ్వరం సముద్రతీరంలో నాలుగు రోజులుగా పెనుగాలులు వీయడంతో అధికారుల హెచ్చరికల మేరకు జాలర్లు చేపలవేట మానుకుని ఇళ్లపట్టునే గడిపారు. దీంతో రామేశ్వరం రేవుల్లో చేపల ఎగుమతి ఆగిపోయి రూ.5కోట్లకు పైగా వ్యాపారాలకు నష్టం వాటిల్లినట్లు మత్స్యకారుల సంఘం నాయకులు తెలిపారు. ఐదో రోజూ జాలర్లు చేపల వేటకు వెళ్లకపోవడంతో రామేశ్వరం రేవు ప్రాంతం పడవల రాకపోకల సందడి లేక బోసిపోయింది. శనివారం వేకువజాము నుంచి రామేశ్వరం తీరం పొడవునా గంటకు 45 నుండి 60 కి.మీల వేగంతో పెనుగాలులు వీయడంతో అధికారులు చేపలవేటపై నిషేధం ప్రకటించారు. దీనితో వేకువజాము చేపలవేటకు సిద్ధమైన జాలర్లందరూ తిరుగుముఖం పట్టారు.

వెంకయ్యనాయుడు జీవిత చరిత్ర పుస్తకాన్ని పరిచయం చేస్తున్న అతిథులు


వెంకయ్యకు ఆత్మీయ సత్కారం

● ఘనంగా జన్మదిన వేడుకలు


వెంకయ్యకు టీటీడీ ప్రసాదాలు అందిస్తున్న శ్రీకృష్ణ, రవి సన్నారెడ్డి తదితరులు

ప్యారీస్, జూలై 20: భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు 75వ జన్మదిన వేడుకలు శనివారం స్థానిక లీలా ప్యాలెస్ హోటల్‌లో ఘనంగా జరిగాయి. స్వర్ణభారతి ట్రస్ట్ నిర్వాహకురాలు దీపా వెంకట్ అధ్యక్షత వహించిన ఈ వేడుకల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న తెలుగు ప్రముఖులు, పలు రాజకీయ పార్టీల అగ్రనాయకులు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు. శ్రీసిటీ అధినేత డాక్టర్ రవి సన్నారెడ్డి ఆహ్వానం పలికిన ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు 50 ఏళ్ల రాజకీయ జీవిత విశేషాలతో ముద్రించిన పుస్తకాన్ని సభకు పరిచయం చేసి ప్రముఖులకు ప్రతులు అందజేశారు. ముందుగా తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ మాట్లాడుతూ... దేశభక్తి, మాతృభాషపై మమకారం పెంచుకున్న వెంకయ్యనాయుడు ఆంధ్రప్రదేశ్‌లోని ఓ రైతు కుటుంబంలో జన్మించి జీవితంలో అంచెలంచెలుగా ఎదిగి ఉపరాష్ట్రపతి పదవికి చేరుకున్నారని కొనియాడారు. రాజ్యసభలో ఆయన నేతృత్వంలో తాను కూడా సభ్యుడిగా పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర బీజేపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్ మాట్లాడుతూ... దేశ రాజకీయాల్లో బాగా రాణించిన వెంకయ్యనాయుడు 75 ఏళ్ల ప్రాయంలో కూడా చురుగ్గా ఉన్నారన్నారు. అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ మాట్లాడుతూ... వెంకయ్యనాయుడు బహుముఖ ప్రజ్ఞాశాలి అని, పలు భాషలు అనర్గళంగా మాట్లాడ గలిగిన ప్రతిభాశాలి అని కొనియాడారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో కేంద్రప్రభుత్వం ప్రకటించిన మెట్రోరైలు పథకం అమలు కావడానికి వెంకయ్య ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ మాట్లాడుతూ... కవిత్వం, చమత్కారంలో వెంకయ్యనాయుడు దిట్ట అని, ఆయన తమ లాంటి వారికి రాజకీయాల్లో ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ఇంకా మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం, రాజ్యసభ సభ్యులు పి.విల్సన్, బీద మస్తాన్‌రావు, ప్రముఖ నటులు విశాల్, నమిత, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు డాక్టర్ నల్లి కుప్పుస్వామిశెట్టి, కెన్సెస్ అధినేత కె.నరసారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, టీటీడీ చెన్నై సమాచార కేంద్ర సలహామండలి మాజీ అధ్యక్షులు ఎన్.శ్రీకృష్ణ, నిర్మాత ఏఎం రత్నం, కెన్సెస్ గ్రూపు సంస్థల సీఈవో ఎం.కృష్ణ, విద్యావేత్తలు ఆర్ఎం మునిరత్నం, డాక్టర్ పారివేందర్, పొక్కాలి బాలాజీ, లయన్ జి.మురళి, కనిగెలుపుల శ్రీనివాసమూర్తి, బీవీ రెడ్డి, బీజేపీ నేతలు ఎం.చక్రవర్తి, హెచ్.రాజా, ప్రముఖ ఆర్కిటెక్ట్ ఎం.ఆదిశేషయ్య, ఎరుకలయ్య, పి.మారుతి, ద్రావిడ దేశం అధ్యక్షుడు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.


సభకు హాజరైన ప్రముఖులు

ఉప ముఖ్యమంత్రి పదవిపై సీఎందే నిర్ణయం

యువజన విభాగ పదవికి సాటిలేదు ● మంత్రి ఉదయనిధి ప్రకటన


డీఎంకే యువజన విభాగం వార్షికోత్సవాల్లో పాల్గొన్న నిర్వాహకులతో మంత్రి ఉదయనిధి

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రంలో ఎన్నిసార్లు పర్యటించినా, ఎన్ని సభల్లో పాల్గొన్నా బీజేపీ గెలిచే ప్రసక్తే లేదని రాష్ట్ర యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. డీఎంకే యువజన విభాగం 45వ వార్షికోత్సవం తేనాంపేటలోని ఆ విభాగం ప్రధాన కార్యాలయం అన్బగంలో శనివారం ఘనంగా జరిగింది. ఆ సందర్భంగా ఏర్పాటైన సభకు డీఎంకే యువజన విభాగం కార్యదర్శిగా ఉన్న ఉదయనిధి అధ్యక్షత వహించి ఉద్వేగంగా ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ పార్టీ సాధారణ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారని, పార్టీలో ఎన్నో విభాగాలున్నా ఆయనకు నచ్చిన విభాగం యువజనమే అన్నారు. ఈ విభాగమే ఆయన్ని అంచెలంచెలుగా ఉన్నతస్థితికి తీసుకెళ్లిందన్నారు. యువజన విభాగం వార్షికోత్సవాల్లో స్టాలిన్ పాల్గొనలేకపోయినా శుక్రవారం రాత్రి, శనివారం ఉదయం తనకు రెండు సార్లు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారని చెప్పారు. యువజన విభాగానికి బ్రాండ్ అంబాసిడర్ స్టాలినే అని చెప్పడం అతిశయోక్తి కాదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం యువజన విభాగం నేతలు, సభ్యులు తీవ్రంగా పాటుపడ్డారని, వారి సేవలను తాను ఎన్నటికీ మరువనని చెప్పారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సహాయకుడిగా (డిప్యూటీ ముఖ్యమంత్రిగా) ఉండాలని యువజన విభాగం నేతలు ప్రతిపాదించడం సంతోషంగా ఉందని, అయితే తానే కాకుండా మంత్రులంతా ముఖ్యమంత్రికి సహాయకులుగానే సేవలందిస్తున్నామనే విషయాన్ని మరువకూడదని నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. గత కొద్ది నెలలుగా డిప్యూటీ సీఎం అవుతాననని ప్రసార మాధ్యమాల్లో వార్తలు వెలువడుతున్నాయని, మంత్రి వర్గ విస్తరణ జరుగబోతోందని, ఉప ముఖ్యమంత్రి సీటును తాను రిజర్వు చేసుకున్నానని కూడా విమర్శలు వస్తున్నాయన్నారు. తనకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలా వద్దా అనే విషయంపై తుది నిర్ణయం తీసుకోవాల్సింది ముఖ్యమంత్రి స్టాలిన్ మాత్రమేనని, తనకు ఎన్ని పెద్ద పదవులు వచ్చినా డీఎంకే యువజన విభాగం కార్యదర్శి పదవే తనకు చాలా ఇష్టమని, ఈ విభాగాన్ని తాను ఎన్నడూ మరువజాలనని ఉదయనిధి అన్నారు.

వచ్చే శాసనసభ ఎన్నికల్లో... : గత లోక్‌సభ ఎన్నికలు, ఇటీవల జరిగిన విక్రవాండి ఉప ఎన్నికల్లో పార్టీ యువజన విభాగం కార్యకర్తలంతా ఎలా పాటుపడ్డారో అదే విధంగా 2026లో జరిగే శాసనసభ ఎన్నికల్లోనూ పార్టీ గెలిపిద్దామంటూ ఆయన శపథం చేశారు. 2026 ఎన్నికల్లోనూ విజయం సాధించి స్టాలిన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిని చేయడమే తమ ప్రధాన కర్తవ్యమన్నారు. ఈ సమావేశం తర్వాత ఉదయనిధి విలేకరులతో మాట్లాడుతూ... నీట్‌కు వ్యతిరేకంగా న్యాయపోరాటం జరుపుతూనే ఉంటామని చెప్పారు. అసెంబ్లీలోనూ నీట్ వ్యతిరేక ప్రతిపాదన ఆమోదించి రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో డిప్యూటీ సీఎం పదవిని చేపట్టనున్నారా అని విలేకరుల ప్రశ్నించగా, ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది ముఖ్యమంత్రి మాత్రమేనని ఉదయనిధి బదులిచ్చారు.


ఉచిత సైకిళ్లను స్వీకరించిన ప్లస్-1 విద్యార్థులతో మంత్రులు రాజకన్నప్పన్, ఎం. సుబ్రమణ్యం తదితరులు

ప్లస్1 విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ

● ప్రారంభించిన మంత్రులు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న ప్లస్1 విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ శనివారం ఉదయం ప్రారంభమైంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్లస్-1 విద్యార్థులకు పంపిణీ చేయడానికి రూ.253.10 కోట్లతో 5,47,676 సైకిళ్లను ప్రభుత్వం కొనుగోలు చేసింది. స్థానిక వెస్ట్ సైదాపేట కార్పొరేషన్ మహోన్నత (మాండోప్పు) పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటైన ప్రత్యేక సభలో ఈ ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి మంత్రులు రాజకన్నప్పన్, ఎం.సుబ్రమణ్యం శ్రీకారం చుట్టారు. పదిమంది విద్యార్థులకు వీరు సైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఓబీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. విజయకుమార్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ టీ.ఎస్.వెంకటేష్, ఓబీసీ సంక్షేమ శాఖ కమిషనర్ వి.సంపత్, మైనారిటీల సంక్షేమ శాఖ కమిషనర్ ఎం.హసియా మరియం, చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిద్ధార్థ్ జక్డే, పాఠశాలల విద్యా శాఖ సంచాలకుడు కన్నప్పన్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార ధ్వని

శ్రీ కళా సుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు అష్టావధానం

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీ కళా సుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూర్ణిమ, అష్టావధాన కార్యక్రమాలు జరగనున్నాయి. సాయంత్రం 4.30 గంటలకు స్థానిక టి.నగర్ విజయరాఘవ రోడ్డులో ఉన్న ఆంధ్రా క్లబ్‌లో జరుగనున్న ఈ కార్యక్రమంలో శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్‌కు 'గురుశ్రీ' బిరుదు ప్రదానం చేయనున్నారు. అనంతరం జరగనున్న అష్టావధానం కార్యక్రమానికి సంచాలకులుగా ఉప్పలధడియం భరత్ శర్మ వ్యవహరించనున్నారు. ఆచార్య సీఎంకే రెడ్డి, ఆచార్య విస్తాలి శంకరరావు, పోలిశెట్టి ఆదినారాయణ, తిరుమల ఆముక్తమాల్యద, డాక్టర్ ఎలిజబెత్ జయకుమారి, కళప్రద పృచ్ఛకులుగా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి పోటీలు 2కు వాయిదా

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 'అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి' ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన జరగాల్సిన తెలుగు భాషా సాహిత్య అంతర్ పాఠశాల వార్షిక పోటీలు ఆగస్టు 2కు వాయిదా పడ్డాయి. సమితి ప్రతి ఏడాది ఈ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాదికి గాను ఈ నెల 26వ తేదీన జరగాల్సిన పోటీలు వాయిదా పడినట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

తమిళంలో నేం బోర్డు లేని కార్యాలయాలకు జరిమానా

ఐసిఎఫ్, జూలై 20: రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో తమిళంలో నేం బోర్డులు లేకపోతే రూ.2,000 జరిమానా విధించనున్నట్లు తమిళ అభివృద్ధి శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో నేం బోర్డు తమిళంలో తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన అమలులో ఉంది. అయితే వ్యాపారులు ఈ నిబంధన పాటించడం లేదు. ఈ నేపథ్యంలో, సచివాలయంలో ఉన్న ప్రభుత్వ శాఖలు, కలెక్టర్ కార్యాలయాల్లో నేం బోర్డులు ఆంగ్లంలో ఉన్నాయి. దీనిపై స్పందించిన తమిళ అభివృద్ధి శాఖ, తప్పనిసరిగా వాటిని తమిళంలో ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఆంగ్లం, ఇతర భాషల్లో నేం బోర్డు ఏర్పాటు చేయదలిస్తే తమిళం, ఆంగ్లం, ఇతర భాషల్లో 5:3:2 నిష్పత్తుల్లో రాసి ఉంచాలని పేర్కొంది.

రిజిస్ట్రేషన్ శాఖలో అదనపు ఐజీలు

ఐసిఎఫ్, జూలై 20: రిజిస్ట్రేషన్ శాఖలో అదనపు ఐజీలు నియమితులయ్యారు. ఈ శాఖలో స్టాంప్, రిజిస్ట్రేషన్ల పనులను అదనపు ఐజీ నెల్సన్ పర్యవేక్షించారు. ఆయన ప్రస్తుతం మార్గదర్శక పనుల విభాగానికి బదిలీ అయ్యారు. రిజిస్ట్రేషన్ శాఖ అధ్యక్షుడి పీఏగా ఉన్న డీఐజీ సుధా మాల్యా అదనపు ఐజీగా పదోన్నతి పొంది స్టాంపులు, రిజిస్ట్రేషన్ పనుల విభాగానికి బదిలీ అయ్యారు. అలాగే, కడలూరు మండల డీఐజీ జనార్దనం అదనపు ఐజీగా పదోన్నతి పొంది ఇన్వెస్టిగేషన్ విభాగానికి బదిలీ అయ్యారు.

3, 4 తేదీల్లో కొడైకెనాల్‌లో డాగ్ షో

ఐసిఎఫ్, జూలై 20: 'ది కొడైకెనాల్ కెన్నెల్ అసోసియేషన్' ఆధ్వర్యంలో కొడైకెనాల్ మూంజికల్లులో ఆగస్టు 3,4 తేదీల్లో డాగ్ షో జరగనుంది. ది కొడైకెనాల్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించనున్న ఈ షోలో శునకాలను 11 గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహించనున్నారు. విదేశాల నుంచి వచ్చే న్యాయనిర్ణేతలు గెలుపొందే శునకాలకు బహుమతులు అందజేయనున్నారు. ఇతర వివరాలకు నెం.044-26260603, 9880446278లో సంప్రదించవచ్చు.

వైద్యకళాశాలల్లో ఎండీ యోగా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 20: చెన్నైలో ఉన్న ప్రభుత్వ యోగా, ప్రకృతి వైద్యకళాశాల, చెంగల్పట్టులో ఉన్న అంతర్జాతీయ యోగా, ప్రకృతి వైద్యకళాశాలల్లో ఎండీ యోగా కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆదివారం నుంచి ఆగస్టు 5వ తేది వరకు www.tnhealth.tn.gov.in నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసి, రూ.3,000 దరఖాస్తు రుసుముతో కలిపి సమర్పించాలి. ప్రవేశ పరీక్ష నిర్వహించే తేదీ, స్థలం, సమయం వంటి వివరాలు త్వరలో ప్రకటిస్తారు. ప్రవేశ పరీక్ష మార్కుల ఆధారంగా అడ్మిషన్లు ఉంటాయని అధికారులు తెలిపారు.

నేడు ఆవడిలో చెస్ పోటీలు

ఐసిఎఫ్, జూలై 20: స్థానిక ఆవడిలో ఉన్న వేళమ్మాల్ విద్యాలయం పాఠశాల ప్రాంగణంలో ఆదివారం చెస్ పోటీలు జరుగనున్నాయి. రాష్ట్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో ఒకరోజు జరిగే ఈ పోటీల్లో 8,10,12,15 ఏళ్లలోపున్న వారు పాల్గొనవచ్చు. గెలుపొందే వారికి నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేస్తారు. ఆసక్తి ఉన్న వారు నేరుగా వచ్చి పాల్గొనవచ్చు. ఇతర వివరాలకు 9941490200 నెంబరు సంప్రదించవచ్చు.

పెరిగిన కూరగాయల ధరలు

ఐసిఎఫ్, జూలై 20: వర్షాల కారణంగా దిగుమతులు తగ్గడంతో కూరగాయలు ధరలు పెరిగాయి. స్థానిక కోయంబేడు మార్కెట్‌కు తమిళనాడు నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. ఆడి మాసం కావడంతో వివాహాలు, శుభ కార్యాలు లేని కారణంగా ధరలు తగ్గుతాయని ఊహించిన నేపథ్యంలో, కర్ణాటక, ఆంధ్రాలో కురుస్తున్న వర్షాలతో తక్కువ లోడులో కూరగాయలు దిగుమతి అవుతున్నాయి. కర్ణాటక నుంచి మాత్రమే రోజులకు 120 లారీల్లో వస్తున్న కూరగాయలు ప్రస్తుతం 50 లారీల్లో వస్తుండడంతో కిలో టమోటా రూ.70, పెద్ద ఉల్లి రూ.60, చిన్న ఉల్లి రూ.80, క్యారట్ రూ.70. బీట్‌రూట్ రూ.90, క్యాబేజీ రూ.50, బీన్స్ రూ.80, బెండకాయలు, వంకాయలు రూ.40 విక్రయమవుతున్నాయి.

యూపీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, జూలై 20: యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష శిక్షణకు సంబంధించిన ఉపకారవేతన పథకానికి ఈ నెల 28వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం తెలిపింది. ఈ పథకం కింద ప్రతి సంవత్సరం 1,000 మంది సివిల్ సర్వీస్ చదివే విద్యార్థులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి 10 నెలలకు ప్రతినెలా రూ.7,500 ఉపకారవేతనం అందజేయనున్నారు. పరీక్ష ఉత్తీర్ణులైన అనంతరం రూ.25,000 అందిస్తారు. రాష్ట్రానికి చెందిన విద్యార్థులు https://portal.naanmudhalvan.tn.gov.in/up-sc_registrationలో ఈనెల 28వ తేది వరకు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అన్నాడీఎంకే కౌన్సిలర్ అరెస్ట్

● కూవం నదిలో పడేసిన సెల్‌ఫోన్ల స్వాధీనం



అరెస్టయిన హరిధరన్, స్కూబా డైవింగ్ వీరులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసుకు సంబంధించి సీబీసీఐడీ పోలీసులు అన్నాడీఎంకే కౌన్సిలర్‌ను అరెస్ట్ చేశారు. అంతేగాక హత్యకేసు నిందితులు కూవం నదిలో పారేసిన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆమ్‌స్ట్రాంగ్ ఈనెల 5న చెన్నైలో దారుణహత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్య కేసులో పొన్నై బాలు, తిరువేంగడం, అరుళ్ సహా 11 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో, పోలీసుల నుంచి తప్పించుకునేందుకు యత్నించిన తిరువేంగడం ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. అలాగే, ఈ కేసుకు సంబంధించి బీజేపీ నిర్వాహకురాలు అంజలను పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. దీంతో, ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య 15కు చేరింది. ఈ నేపథ్యంలో, ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు సంబంధించి మరొకరిని అరెస్ట్ చేశారు. ఇప్పటికే అరెస్టయిన అరుళ్ సెల్‌ఫోన్ హరిధరన్ వద్ద ఉండడమే మరో నిందితుడిని పట్టిచ్చింది. అరెస్టయిన హరిధరన్ తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూర్ పంచాయతీ అన్నాడీఎంకే కౌన్సిలర్‌గా వ్యవహరిస్తున్నాడు. అతన్ని పోలీసులు విచారించిన సమయంలో, ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు వినియోగించిన సెల్‌ఫోన్లు పగులగొట్టి కూవం నదిలో వేసినట్లు అంగీకరించాడు. ఈ వాంగ్మూలం ఆధారంగా స్కూబా డైవింగ్ వీరుల సాయంతో పోలీసులు కూవం నదిలో గాలించి 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారమై హరిధరన్‌ను పోలీసులు విచారిస్తున్నారు. శుక్రవారం అరెస్ట్ చేసిన అంజలను కూడా పోలీసులు రహస్య ప్రదేశంలో ఉంచి విచారిస్తున్నట్లు సమాచారం. కాగా హరిధరన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు అన్నాడీఎంకే అధిష్ఠానం ప్రకటించింది.

మరో పదిమంది రౌడీల కోసం గాలింపు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో పరారైన ఉత్తర చెన్నై బీజేపీ మహిళా నేత, దాదా అంజలను పోలీసులు అరెస్టు చేశారు. పుళియంతోపులో దాగిన ఆమెను శనివారం వేకువజామున అరెస్టు చేశారు. ఆమె బ్యాంక్ ఖాతాల్లో లక్షలాది రూపాయల మేరకు డిపాజిట్ చేసి ఉన్నట్లు విచారణలో గుర్తించారు. అంతే కాకుండా ఆమెను విచారించిన పోలీసులు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో మరో 10 మంది రౌడీల ప్రమేయం ఉన్నట్లు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆ రౌడీల వివరాలను సేకరించిన వారి ఆచూకీ కోసం గాలించేందుకు పది ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. వ్యాసర్పాడికి చెందిన పేరుమోసిన రౌడీ జైలులో ఉంటూనే ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు పథకం రూపొందించినట్లు పోలీసుల తాజా దర్యాప్తు లో వెల్లడైంది. ఇక ఆమ్‌స్ట్రాంగ్ 16వ సంస్మరణదినం ఆదివారం జరగనుండటంతో నగరమంతటా పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.



అంజల

కృతజ్ఞత లేఖ రాసి కలక్టర్ వీడ్కోలు



కలెక్టర్ తమిళంలో రాసిన లేఖ

ఐసిఎఫ్, జూలై 20: రామనాథపురం జిల్లా కలెక్టర్ విష్ణుచంద్రన్ ప్రభుత్వ రంగ సంస్థ డిప్యూటీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మున్సిపాలిటీల నిర్వహణ జాయింట్ కమిషనర్ సిమ్రన్ జీత్ సింగ్‌కాలోన్ కొత్త కలెక్టర్‌గా నియమితుల య్యారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రామ నాథపురం ప్రజలకు కలెక్టర్ విష్ణుచంద్రన్ తమిళంలో లేఖ రాశారు. అందులో... 'రామ నాథపురం ప్రజలు, అన్ని శాఖల అధికారు లందరకీ హృదయపూర్వక కృతజ్ఞతలు. కలెక్టర్‌గా సంవత్సరం రెండు నెలలు విధులు నిర్వహించాను. ఈ సమయంలో సహకరించిన ప్రజలు, శాఖా అధికారులు, ఉద్యోగులు అందరికీ నా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కలెక్టర్ అధికారపూర్వ ఫేస్‌బుక్‌లో ఈ లేఖ విడుదల చేశారు. దీన్ని స్వాగతిస్తూ ప్రభుత్వ అధికారులు, ప్రజలందరూ ఆయనకు అభినందనలు తెలియజేశారు.

రూ.1.30 కోట్లతో అండర్ గ్రౌండ్ సంప్



పనులు జరుగుతున్న దృశ్యం

ఐసిఎఫ్, జూలై 20: స్థానిక కోడంబాక్కం అజీస్ నగర్ పరాంకుశపురం ప్రాంతాల్లో నిల్వ చేరే వర్షపు నీటిని తొలగించేందుకు రూ.1.30 కోట్లతో అండర్ గ్రౌండ్ సంప్ నిర్మాణపనులు జరుగుతున్నాయి. చెన్నైలో 2021లో కురిసిన భారీ వర్షాలకు కోడంబాక్కం మండలం తీవ్రంగా నష్టపోయింది. అనంతరం ఈ మండలంలో రూ.188 కోట్లతో వాననీటి కాలువల నిర్మాణాలు చేపట్టారు. దీంతో 2022లో వర్షాలు కురిసినా పెద్దగా నష్టం జరగలేదు. అయితే కోడంబాక్కం 132వ వార్డులో ఉన్న పరాంకుశపురం, అజీస్ నగర్ ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి. ఈ ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు 44వ నెంబరు కలిగిన చిన్న వంతెన గుండా కోడంబాక్కం రైలుపట్టాలు దాటి టి.నగర్ 132వ వార్డు మీదుగా మాంబళం కాలువకు చేరుకోవాల్సి ఉంది. వాననీటి కాలువల్లో పూడిక కారణంగా సక్రమంగా నీరు ప్రవహించక రోడ్లపై నిలుస్తున్నాయి. ఈ సమస్య పరిష్కరించేలా 10 మీటర్ల పొడవు, 3.5 మీటర్ల వెడల్పు, 3 మీటర్ల లోతు కలిగిన అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్ నిర్మిస్తున్నారు.

రూ.11.37 కోట్లతో రోడ్లు, వాననీటి కాలువలు

ఐసిఎఫ్, జూలై 20: స్థానిక పొలిచ్చలూరు, కౌల్ బజార్ ప్రాంతాల్లో పార్క్, వాననీటి కాలువలు, రోడ్ల నిర్మాణ పనులు రూ.11.37 కోట్లతో ప్రారంభమయ్యాయి. ఆలందూర్, పల్లావరం శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని సెయింట్ థామస్ యూనియన్, పొలిచ్చలూరు, కౌల్ బజార్ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆ నిధులతో వాననీటి కాలువలు, రహదారుల నిర్మాణపనులు చేపట్టి, పిల్లల కోసం పార్క్ ఏర్పాటు చేయనున్నామని సీఎండీఏ అధికారులు తెలిపారు.

కాట్పాడి తహసీల్దార్‌కు శుభాకాంక్షలు



తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

వేలూరు, జూలై 20: కాట్పాడి తహసీల్దార్‌గా జగదీశ్వరన్ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు జిల్లా గ్రామ నిర్వాహ అధికారుల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా ప్రచార సెక్రటరీ వినాయకమ్, కాట్పా డి డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్, కోశాధికారి ఇళంగోవన్, డివిజన్ ఉపాధ్యక్షుడు నివేద్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు అన్బరసన్‌లు తహసీల్దార్‌ను కలుసుకొని శాలువాతో శుభాకాంక్షలు తెలిపారు.

దోమలకు నిలయంగా మారిన మసీదు ప్రాంతం



వేలూరు, జూలై 20: స్థానిక సిల్క్ హౌస్ వెనుక పల్లపట్టి మసీదు ఉంది. ఈ మసీదుకు ప్రతిరోజు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఇస్లామీయులు వచ్చి నమాజు చేస్తుంటారు. కానీ, ఈ ప్రాంతంలోని కాలువల్లో చెత్త తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతూ దోమలకు నిలయంగా మారింది. దుర్గంధం కారణంగా మసీదులో నమాజు చేసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయని, పారిశుధ్య సిబ్బంది చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓటర్లకు ఎంపీ కదిర్ ఆనంద్ కృతజ్ఞతలు



ప్రసంగిస్తున్న ఎంపీ

వేలూరు, జూలై 20: ఇటీవల ముగిసిన పార్లమెంటు ఎన్నికల్లో వేలూరు నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థి కదిర్ ఆనంద్ విజయం సాధించారు. ఆయన నియోజకవర్గంలో తిరుగుతూ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ క్రమంలో, శనివారం గుడియాత్తం సమీపం పట్టు పంచాయతీలో పర్యటించిన ఆయన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట యూనియన్ సెక్రటరీ కల్లూరు రవి, పట్టు పంచాయతి అధ్యక్షుడు సుజాని, ఉపాధ్యక్షుడు భాస్కర్, పంచాయతి శాఖ పార్టీ సెక్రటరీ, నిర్వాహకులు, స్వయం సహాయక బృందాల సభ్యులున్నారు.



వేలూరు డీకేఎం మహిళా కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రైవేటు జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి

మాంబళం రహదారిలో ఆక్రమణల తొలగింపు



మాంబళం ఫ్లై ఓవర్ కింద ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పెరంబూర్, జూలై 20: స్థానిక మాంబళంలో ఆక్రమణలను శుక్రవారం కార్పొరేషన్ అధికారులు ఎక్స్‌వేటర్‌తో తొలగించారు. తేనాంపేట మండలం కోడంబాక్కంలో మాంబళం రహదారి ఉంది. ఈ రహదారిని ఆక్రమించి పూలు, పండ్ల దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాటు భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తుతోందని పలువురు జీసీసీ అధికారులకు ఫిర్యాదుచేశారు. దీంతో, ఎక్స్‌కవేటర్‌తో అక్కడికి చేరుకున్న అధికారులు దుకాణాల ఆక్రమణలను, భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించారు.

సీజనల్ వ్యాధులకు 'బాత్రాస్'లో చికిత్స



క్లినిక్ ప్రారంభోత్సవంలో ప్రముఖులు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో సీజనల్ ఫ్లూ కేసులు పెరుగుతున్నాయని, ముఖ్యంగా తిరువొత్తియూరు, షోళింగనల్లూరు వంటి ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా ఉన్నాయని డాక్టర్ బాత్రాస్ హెల్త్‌కేర్ గ్రూప్ సీఈవో సంజోయ్ ముఖర్జీ పేర్కొన్నారు. ఒక్కియంపేట, రాజీవ్ గాంధీసాలైలో ఏర్పాటైన డాక్టర్ బాత్రా క్లినిక్‌ను లాంఛనంగా ప్రారంభించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా తమ సంస్థ హోమియోపతి ప్రయోజనాలను అధునాతన అంతర్జాతీయ సాంకేతికలను మిళితం చేసి ప్రజలకు అందిస్తోందన్నారు. ప్రతి రోగి నిర్దిష్ట అనారోగ్యానికి అనుగుణంగా వ్యక్తిగతీకరించిన సంరక్షణపై దృష్టి పెడుతున్నామని వివరించారు. కాగా ఈ క్లినిక్ ప్రారంభోత్సవంలో శ్రీమతి చెన్నై ఇంటర్నేషనల్ ఫ్యాషన్ ఐకాన్ నిషా రిజిష్ తదితరులు కూడా పాల్గొన్నారు.

అమ్మా క్యాంటీన్లపై స్టాలిన్‌ది మొసలికన్నీరు

● ఈపీఎస్ విమర్శ

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అమ్మా క్యాంటీన్లపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు ఉన్నట్టుండి మొసలి కన్నీరు కారుస్తుండటం వింతగా ఉందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. గత మూడేళ్లుగా అమ్మా క్యాంటీన్లు దుస్థితిలో ఉన్నా డీఎంకే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో 407 అమ్మా క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, డీఎంకే ప్రభుత్వం 19 అమ్మా క్యాంటీన్లను ఎలాంటి కారణాలు లేకుండా మూసివేసిందన్నారు. మూడేళ్లుగా అమ్మా క్యాంటీన్లు ఎలా నడుస్తున్నాయో అధికారులు కూడా తనిఖీ చేయలేదన్నారు. ఇదిలా ఉండగా ఈపీఎస్ విమర్శలపై గ్రేటర్ చెన్నై మేయర్ ఆర్ ప్రియ స్పందిస్తూ అమ్మా క్యాంటీన్లను తనిఖీ చేసినందుకు సీఎం స్టాలిన్‌ను మెచ్చుకునేందుకు బదులుగా దుమ్మెత్తిపోయడం భావ్యమా అని ప్రశ్నించారు. డీఎంకే అధికారంలోకి వచ్చాకే అమ్మా క్యాంటీన్లు చక్కగా పని చేస్తున్నాయని, ప్రస్తుతం ఆ క్యాంటీన్లను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ రూ.21 కోట్లు విడుదల చేశారన్నారు. ఇంతా చేసినా సీఎంను మాట వరుసకైనా అభినందించకుండా ఈపీఎస్ విమర్శించడం గర్హనీయమని పేర్కొన్నారు.

విక్రవాండి విజయానికి డీఎంకే ఇచ్చిన కానుకే విద్యుత్ ఛార్జీల పెంపు

ధర్నాలో జీకే వాసన్ విమర్శ



చెన్నై కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో జీకే వాసన్

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఛార్జీల పెంపు విక్రవాండి ఉప ఎన్నికలో డీఎంకేని గెలిపించినందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజలకిచ్చిన ప్రత్యేక కానుక అని తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత జీకే వాసన్ విమర్శించారు. శనివారం ఉదయం విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా చెన్నై కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా జరిగింది. ఈ ధర్నాలో పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆస్తి పన్ను, పాల ధర, పత్రాల రిజిస్ట్రేషన్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీలు పెరుగుతూను ఉన్నాయన్నారు. దీంతో మధ్య తరగతి ప్రజల నడ్డి విరుగుతోందన్నారు. రెండుసార్లు పెంచింది చాలక మూడోసారి విద్యుత్ చార్జీలను ఎడాపెడా పెంచడం గర్హనీయమన్నారు. విడియల్ శేఖర్, జవహర్‌బాబు, బాషా, జీఆర్ వెంకటేష్, బిజూ చాకో, బాలా, గోవిందసామి, సైదై మనోహరన్, కేపీ లూయిస్ పోరూరు ఆనందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విమాన టిక్కెట్లతో మోసం: ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, జూలై 20: అయోధ్యకు తీసుకెళ్తామని నగదు తీసుకొని నకిలీ విమాన టిక్కెట్లు అందించిన వ్యవహారంలో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. అయోధ్య, కాశీ, గయా తదితర ప్రాంతాలకు ఆధ్యాత్మిక విమాన పర్యటన కల్పించనున్నట్లు సేలం అమ్మాపేటకు చెందిన రాజా ప్రకటన చేశాడు. విమానంలో అయోధ్యకు వెళ్లి తిరిగొచ్చేందుకు రూ.12,000 ప్యాకేజీ ఉన్నట్లు ఆయన పేర్కొన్నాడు. ఈ ప్రకటన నమ్మిన సేలం, దిండుగల్, కరూర్ జిల్లాలకు చెందిన 105 మంది భక్తులు మొత్తం రూ.13 లక్షలు అందజేయగా, రాజా వారికి విమాన టిక్కెట్లు పంపాడు. వీరందరూ మదురై విమానాశ్రయానికి చేరుకోగా, వారి టిక్కెట్లు పరిశీలించిన సిబ్బంది అవి నకిలీవని అని చెప్పి వారిని వెనక్కి పంపారు. ఈ వ్యవహారంపై సేలం నుంచి వెళ్లిన 10 మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసిన పోలీసులు రాజా, అతనికి సాయం చేసిన సభానందాన్ని అరెస్ట్ చేశారు.

విచారణకు హాజరైన బీజేపీ నేత ఎస్జీ సూర్య

పెరంబూర్, జూలై 20: కల్తీ సారా వ్యవహారంలో తప్పుడు కథనాలు పోస్ట్ చేశారనే ఫిర్యాదుకు సంబంధించిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్జీ సూర్య విచారణకు హాజరయ్యారు. విల్లుపురం సీబీసీఐడీ కార్యాలయానికి హాజరైన సూర్యను అధికారులు విచారించారు. తప్పుడు కథనాలు ఎక్స్‌లో పోస్ట్ చేశారని సూర్యకు సీబీసీఐడీ అధికారులు సమన్లు జారీచేశారు.

పారంపర్య సంప్రదాయాలకు ప్రతీక 'ధోవతి'

రామ్‌రాజ్ గ్రూప్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఆర్ నాగరాజన్



కేఆర్ నాగరాజన్

పెరంబూర్, జూలై 20: దేశ పారంపర్య సాంప్రదాయాలకు ప్రతీక 'ధోవతి' అని రామ్‌రాజ్ కాటన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఆర్ నాగరాజ్ తెలిపారు. ఇటీవల బెంగళూరులోని ఓ మాల్‌కు ధోవతి ధరించి వెళ్లిన రైతు పకీరప్పను మాల్ సిబ్బంది లోపలికి అనుమతించకపోవడంతో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనను పలు పార్టీలు, సామాజికవేత్తలు తీవ్రంగా ఖండించారు. ఈ వ్యవహారంపై రామ్‌రాజ్ సంస్థ అధినేత కేఆర్ నాగరాజన్ విడుదల చేసిన ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి... తాను గత వారం ఇంగ్లాండ్ వెళ్లిన సమయంలో మనం ధరించే ధోవతికి ఆ దేశ ప్రజలు ఇస్తున్న మర్యాద, గౌరవం చూసి ఉప్పొంగిపోయానన్నారు. మన జాతిపిత మహాత్మాగాంధీ స్వాతంత్ర్య పోరాటంలోనూ ధోవతి ధరించారని గుర్తు చేశారు. విదేశీ వస్తువులు బహిష్కరించి, పేదరికంలో ఉన్న దక్షిణ భారత జీవనాధారం పెంచేలా గాంధీజీ ధోవతి ధరించడం జరిగిందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పారంపర్య సంప్రదాయాలకు ధోవతి ఆనవాలుగా ఉందన్నారు. అలాంటి ధోవతి ధరించిన అన్నదాతను మాల్ సిబ్బంది అడ్డుకోవడం ఆవేదన కలిగించిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు జరగకుండా మాల్ యాజమాన్యం చర్యలు చేపట్టాలని కేఆర్ నాగరాజన్ విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ కార్యాలయానికి తాళాలు

పూజ చేసిన వార్డు సభ్యులు



కార్యాలయానికి పూల మాల వేసి హారతులిస్తున్న వార్డు సభ్యులు

పెరంబూర్, జూలై 20: చెంగల్పట్టు జిల్లా మధురాంతకం యూనియన్ నైయాపూర్ పంచాయతీలో అభివృద్ధి పనులు, మౌలిక వసతులు కల్పించడంలో చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ పంచాయతీలో 9 వార్డులుండగా, పంచాయతీ అధ్యక్షుడిగా కామరాజ్ వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ఆరోపిస్తూ పంచాయతీ ఉపాధ్యక్షుడు, ఏడుగురు వార్డు సభ్యుల నేతృత్వంలో 200 మంది గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకొని తాళాలు వేశారు. అనంతరం కార్యాలయానికి పూలమాల వేసి టెంకాయ కొట్టి, కర్పూర హారతులిచ్చి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వార్డు సభ్యులు హెచ్చరించారు.

డీఎంకే మాజీ ఎంపీ షణ్ముగ సుందరం మృతి

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా గోపిశెట్టిపాళయం డీఎంకే లోక్‌సభ మాజీ సభ్యుడు వీపీ షణ్ముగసుందరం శనివారం ఉదయం మృతి చెందారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ కోయంబత్తూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందుతూ వచ్చారు. శనివారం ఉదయం చికిత్స ఫలించక ఆయన కన్నుమూశారు. 1996 నుంచి 1998 వరకు ఆయన గోపిచెట్టి పాళయం ఎంపీగా సేవలందించారు. డీఎంకేలో పలు కీలకమైన పదవులు నిర్వహించి పార్టీకి విశిష్ట సేవలందించారు. షణ్ముగసుందరం మృతి పట్ల డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సంతాపం ప్రకటించారు. కుటుంబీకులకు తన ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ ఓ ప్రకటన జారీ చేశారు.

బస్సు కిటికీలపై ఎక్కి విద్యార్థుల వీరంగం



బస్సు కిటికీలపై ఎక్కిన విద్యార్థులు

పెరంబూర్, జూలై 20: చెంగల్పట్టు జిల్లా మరైమలైనగర్ - సింగపెరుమాళ్ కోయిల్ - మరుదేరి మార్గంలో 60ఎంఏ ఎంటీసీ బస్సు నడుస్తోంది. ఈ బస్సు మరుదేరి, కరునిలం, గోవిందాపురం, మేల్‌రోసాపురం తదితర గ్రామాల మీదుగా సింగపెరుమాళ్‌కోయిల్ చేరుకుంటుంది. ఈ బస్సులో ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. బస్సు ఖాళీగా ఉన్నా కొందరు విద్యార్థులు ఫుట్‌బోర్డు, బస్సు కిటికీలపై ఎక్కి ఆగడాలు చేస్తుంటారని ప్రయాణికులు చెబుతున్నారు. ఈ రోడ్డులో మలుపులు అధికంగా ఉంటాయని, విద్యార్థులు ఆ విధంగా ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే ప్రమాదముందని, ఈ విషయమై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని ప్రయాణికులు కోరుతున్నారు.

21 మంది న్యాయవాదులపై కేసు నమోదు

పెరంబూర్, జూలై 20: స్థానిక ఎగ్మూర్ కోర్టు ప్రాంగణంలో బాహాబాహీకి పాల్పడిన 21 మంది న్యాయవాదులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆవడి ట్రాఫిక్ పోలీసు కార్యాలయ పరిధిలోని రెడ్‌హిల్స్‌లో రోడ్డు ప్రమాదానికి సంబంధించిన కేసు నమోదైంది. ప్రమాద బాధితులకు పరిహారం అందించాలని కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణకు వచ్చిన కొందరు న్యాయవాదులు కోర్టు ప్రాంగణంలో కూర్చొని మాట్లాడుకుంటున్నారు. ఈ కేసు మరో న్యాయవాది వాదించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని న్యాయవాదుల మధ్య ప్రారంభమైన చర్చ చివరకు ఉద్రిక్తతకు దారితీసింది. న్యాయవాదులు రెండు వర్గాలుగా మారి ప్లాస్టిక్ కుర్చీలతో పరస్పరదాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనపై ఫిర్యాదు చేస్తామని పోలీసులు తెలుపగా, తామే చర్చించి పరిష్కరించుకుంటామని న్యాయవాదులు పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడిన హైకోర్టు న్యాయవాది విజయకుమార్ ఓమందూర్ ప్రభుత్వాసుపత్రి, న్యాయవాదులు సెంథిల్‌నాథన్, శక్తివేలు తదితరులు రాయపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యవహారంలో 21 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెరియార్ వర్శిటీలో 77 మంది ఉద్యోగులకు నోటీసులు

పెరంబూర్, జూలై 20: సేలం పెరియార్ వర్శిటీ ఉపకులపతి పదవీకాలం పొడిగించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన 77 మంది ఉద్యోగులకు నోటీసులు జారీ అయ్యాయి. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే నోటీసులు జారీ చేసినట్లు ఉద్యోగులు చెబుతున్నారు. ఈ వర్శిటీ ఉపకులపతి జగన్నాథన్ గత నెల 30న పదవీవిరమణ పొందనున్న నేపథ్యంలో, ఆయన పదవీకాలాన్ని మరో మూడేళ్లు పొడిగిస్తూ ఛాన్సలర్, గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో, పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపకులపతి జగన్నాథన్ పదవీకాలం పొడిగించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టిన కాంట్రాక్ట్, దినసరి ఉద్యోగులు అని మొత్తం 77 మందికి నోటీసులు జారీ అయ్యాయి. ఈ నోటీసుపై తగిన సంజాయిషీ ఇవ్వాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు చేపడతామని వర్శిటీ రిజిస్ట్రార్ (బాధ్యత) విశ్వనాథమూర్తి పేర్కొన్నారు.

కుమార్తెలను హతమార్చి తల్లి ఆత్మహత్య

పెరంబూర్, జూలై 20: కుటుంబ మనస్పర్థల కారణంగా ఇద్దరు కుమార్తెలను హతమార్చిన ఓ మహిళ తానూ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఈరోడ్ జిల్లాలో చోటుచేసుకుంది. కరంగల్‌పాల్యం పచ్చయమ్మన్ ఆలయ వీధికి చెందిన జాకీర్ హుస్సేన్, హసీనా దంపతులకు ఫాతిమా (16), జనా ఫాతిమా (14) కుమార్తెలున్నారు. జాకీర్ హుస్సేన్, హసీనా మధ్య అప్పులకు సంబంధించి గొడవలు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం పనికి వెళ్లిన హుస్సేన్, తన భార్యకు ఫోన్ చేయగా ఆమె తీయలేదు. దీంతో, అతను ఇంటికి వెళ్లి చూడగా మంచంపై ఇద్దరు కుమార్తెలు, పక్క గదితో హసీనా విగతజీవులుగా పడి ఉండడాన్ని గమనించి కరంగల్‌పాల్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాల్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి జాకీర్‌హుస్సేన్‌ను విచారిస్తున్నారు. ఘటన జరిగిన రోజు ఉదయం భార్యాభర్తలు గొడవపడ్డారని, దీంతో కోపంతో హుస్సేన్ బయటకు వెళ్లిపోవడంతో మనస్తాపం చెందిన హసీనా, తన ఇద్దరు కుమార్తెలకు విషమిచ్చి, పక్క గదికి వెళ్లి తాను విషం తాగి ఆత్మహత్యకు పాల్పడిందని ప్రాథమిక విచారణలో తెలిసింది.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న సైనికుడి అరెస్ట్

పెరంబూర్, జూలై 20: తంజావూరు జిల్లాలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న సైనికుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కుంభకోణం ముత్తుపిళ్లై మండపం ప్రాంతానికి చెందిన వసంత్ త్రిపురలో సైనికుడిగా పనిచేస్తున్నాడు. వసంత్, అతని స్నేహితుడు నీలామంగళం రెట్టై ప్రాంతానికి చెందిన శివ (35)లు మైలాడుదురై జిల్లా కుత్తాలం ప్రాంతంలో ఓ మహిళ మెడలోని నగలు చోరీ చేస్తూ పోలీసులకు చిక్కారు. త్రిపురలో సైనికుడిగా పనిచేస్తున్న వసంత్, సెలవుపై ఇంటికొచ్చిన సమయంలో స్నేహితుడు శివతో కలసి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతుంటారని పోలీసుల విచారణలో తెలిసింది.



చెన్నైలో 'ఫ్లై డైనింగ్'

'పక్షుల్లాగా రెక్కలుంటే ఆకాశంలో ఎగరొచ్చుకదా' అనే కోరిక ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అలా ఆకాశంలో ఎగురుతూ ప్రకృతి అందాలు వీక్షిస్తూ... డిన్నర్ చేయడం సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. అలాంటి ఆలోచనలకు రూపకల్పనే 'ఫ్లై డైనింగ్'.. ప్రస్తుతం పలు దేశాలు, దేశంలోని ప్రముఖ నగరాల్లో ఫ్లై డైనింగ్ అందుబాటులో ఉన్నాయి. తాజాగా చెన్నై శివార్లలో ఈ ఫ్లై డైనింగ్ అందుబాటులోకి వచ్చింది. ఆకాశంలో విహరిస్తూ కుటుంబసభ్యులు, బంధువులతో జన్మదిన, శుభకార్యాల విందులు కూడా జరుపుకోవచ్చు.

- పెరంబూర్



సరికొత్త అనుభూతి...

ప్రముఖ వీజీపీ సంస్థ తొలుత గృహోపకరణాల విక్రయాలు ప్రారంభించింది. అనంతరం రియల్ఎస్టేట్ సహా పలు వ్యాపారాలు చేపట్టింది. అలా పలు రకాల వ్యాపారాలు చేపట్టిన వీజీపీ, ప్రజలకు కాలక్షేపం కలిగించేలా అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు చేయాలనే ఆలోచనతో 'వీజీపీ వండర్ ల్యాండ్' ప్రారంభించింది. ఈ వండర్ ల్యాండ్ అన్ని రకాల వినోద కార్యక్రమాలు, ఆహ్లాద వాతావరణం చోటుచేసుకొని ఉంటోంది. పొరుగు జిల్లాలు, రాష్ట్రాలతో పాటు విదేశీ పర్యాటకులు కూడా ఈ ప్రాంతానికి వెళ్లి ఆహ్లాదంగా గడిపేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఇక, ఈ పార్క్‌కు వచ్చే సందర్శకులకు మరింత వినోదాత్మకమైన, సరికొత్త అనుభూతి కలిగించేలా వీజీపీ యాజమాన్యం యోచించింది. పలు దేశాల్లో పర్యటించి పరిశీలన అనంతరం 'ఫ్లై డైనింగ్' చేపట్టాలని నిర్ణయించింది.

విహరిస్తూ విందు భోజనం

ఆకాశంలో ఎగురుతూ డిన్నర్ చేయడమే ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకత..ఇందుకోసం జర్మన్ టెక్నాలజీ వినియోగించారు. భారీ క్రేన్ సాయంతో సుమారు 160 అడుగుల ఎత్తుకు వెళ్లవచ్చు. అక్కడి నుంచి నగర అందాలు, సముద్ర సోయగాలు చూస్తూ ఆహ్లాదంగా గడపడంతో పాటు రుచికరమైన భోజనం కూడా చేసే వసతి కల్పించారు. ఈ భారీ క్రేన్ సుమారు 160 టన్నుల బరువు ఎత్తే సామర్థ్యం కలిగి ఉంది. ఆ క్రేన్‌కు కింది భాగంలో 25 మంది కూర్చొనేలా సీటు వసతి కల్పించారు. వారికి భోజనం సరఫరా చేసేందుకు మరో ఐదుగురు ఉంటారు. దీంతో, క్రేన్ మోసే మొత్తం బరువు ఏడు టన్నులు మాత్రమే.


క్రేన్ సాయంతో ఏర్పాటైన 'ఫ్లై డైనింగ్'

భద్రతాంశాలు...

క్రేన్‌పై ఆకాశంలో విహరించాలంటే దాని పునాదులు బలంగా ఉండాలి. ఇల్లు కట్టేందుకు పునాదులు ఎంత ముఖ్యమో, ఈ క్రేన్ పునాదులు కూడా అంత బలంగా ఏర్పాటు చేశారు. నాలుగు స్టీల్ బీంలపై ఈ క్రేన్ రూపొందించారు. క్రేన్ నుంచి నాలుగు ఇనుప కమ్మీలపై కూర్చొనేలా సీట్లు ఉన్నాయి. ఒక ఇనుప కమ్మీపై ఎనిమిది మంది కూర్చోవచ్చు. ఇక, భద్రత కోసం 100 సెన్సార్లు ఏర్పాటయ్యాయి. సందర్శకుల బరువు, సముద్ర గాలి వేగం సహా పలు భద్రతా అంశాలను సెన్సార్లు పర్యవేక్షిస్తుంటాయి. సముద్ర గాలి వేగం కూడా అత్యంత ప్రధానమైనది. గాలి అధికంగా ఉంటే క్రేన్ నడపడం కష్టమైన పని. అందువల్ల ప్రతి సెకనుకు గాలి వేగాన్ని పర్యవేక్షిస్తుంటారు.

మధురానిభూతి...

తొలుత ఆకాశంలో విహరించే సమయంలో చేపట్టాల్సిన భద్రత చర్యలను వివరిస్తారు. అనంతరం సందర్శకులు, సిబ్బంది ఎక్కిన తర్వాత క్రేన్ నిదానంగా 160 అడుగుల ఎత్తుకు తీసుకెళ్లి నిలుపుతారు. అక్కడి నుంచి నగర అందాలు, సముద్ర కెరటాల హొయలు చూడవచ్చు. క్రేన్ బయల్దేరే సమయంలోనే కావాల్సిన ఆహార పదార్థాలను సిబ్బంది అందులో ఉంచుతారు. క్రేన్ పైకి వెళ్లిన తర్వాత తొలి 30 నిమిషాల పాటు పలురకాల జ్యూస్ సిబ్బంది సరఫరా చేస్తారు. అనంతరం డిన్నర్ ఉంటుంది. అందులో గ్రిల్డ్ చికెన్ సహా పలురకాల మాంసాహార వంటకాలు, రుచికరమైన శాకాహార వంటకాలు ఉంటాయి. సిబ్బంది స్వయంగా తిరుగుతూ వడ్డిస్తుంటారు. అలా గంట అనంతరం తిరిగి క్రేన్‌ను కిందకు దించుతారు. ప్రస్తుతం పలు రకాల ప్యాకేజీలతో 'ఫ్లై డైనింగ్' అందుబాటులో ఉంది. వివరాలకు 8508949494 అనే నెంబరులో సంప్రదించవచ్చు.


రాత్రి వేళల్లో విద్యుద్దీపాల వెలుగుల్లో ....


ఆ సన్నివేశాల చిత్రీకరణలో నిజంగానే ఏడ్చేశాం



● నటి ఖుష్బూ

'వారిసు' చిత్రంలో విజయ్, తాను కలిసి నటించిన పలు సన్నివేశాలు ఎంతో ఎమోషనల్‌గా ఉంటాయని, వీటి చిత్రీకరణ సమయంలో నిజంగానే తామిద్దరం ఏడ్చేశామని నటి ఖుష్బూ చెప్పారు. తాజాగా ఆమె ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో.. 'వారిసు' చిత్రంలో నాకు, విజయ్‌కు మధ్య సాగే సన్నివేశాలు చాలా ఎమోషనల్‌గా చిత్రీకరించారు. ఇది సోలో ట్రాక్. మంచి అందమైన ట్రాక్. కుటుంబ సన్నివేశం. ఆ సమయంలో నా సన్నివేశాలన్నీ విజయ్‌తో చిత్రీకరించారు. ఆ సినిమాలో ఇతర నటీనటులతో నాకు సీన్లు లేవు. నాకు విజయ్‌కి ఆ సన్నివేశాలు ఎంతో ఎమోషనల్‌గా ఉంటాయి. వాటిని షూట్ చేస్తున్నపుడు విజయ్, నేను నిజంగానే ఏడ్చేశాం. అయితే, సినిమా నిడివి ఎక్కువ కావడంతో వాటిని తొలగించినట్టు దర్శకుడు వంశీ వెల్లడించారు.

విజయ్, రష్మిక, ఖుష్బూ



చిత్రజ్యోతి

దర్శకుడు వెంకటేష్‌ను నమ్ముకున్న

హీరో విజయ్ సత్య

త్వరలో 'దిల్ రాజ' విడుదల

స్టార్ హీరో విజయ్ వంటివారిని డైరెక్ట్ చేసి ఎన్నో విజయవంతమైన చిత్రాలను రూపొందించిన దర్శకుడు ఎ.వెంకటేష్.. ఇపుడు విజయ్ సత్య కథానాయకుడిగా 'దిల్ రాజ' పేరుతో చిత్రాన్ని తెరకెక్కించారు. విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్రం గురించి హీరో విజయ్ సత్య శుక్రవారం చెన్నైలో విలేకరులతో మాట్లాడుతూ.. 'గతంలో పలు చిత్రాల్లో నటించా. సరైన హిట్ లేకపోవడంతో కొంతకాలంగా ఇండస్ట్రీకి దూరంగా ఉన్నా. ఇప్పుడు 'దిల్ రాజ' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానున్నాను.గతంలో పలు విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు వెంకటేష్ మంచి కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఆనందంగా గడిపే మధ్య తరగతి కుటుంబంలో అనుకోకుండా, సంఘ విద్రోహశక్తుల కారణంగా సంఘటన జరుగుతుంది. దీంతో ఆ ఫ్యామిలీకి చెందిన యువకుడు ఏ విధంగా స్పందించాడన్నదే ఈ చిత్ర కథ. మంచి పాయింట్‌తో ఆసక్తికరంగా, అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా రూపొందించారు. త్వరలోనే విడుదల చేస్తాం. హీరోయిన్‌గా షెరిన్ శ్రీంగర్ నటించగా, ఇతర పాత్రల్లో అమ్రిష్, ఆంటోనీ దాసన్, కేపీవై బాలా తదితరులు నటించారు. అమ్రీష్ సంగీతం అందించారు. గోల్డెన్ ఈగల్ స్టూడియో పతాకంపై నిర్మాత కోవై బాలా నిర్మించారు. 'దిల్ రాజ' టైటిల్‌కు ఎలాంటి సంబంధం లేదు. ప్రేక్షకులకు ఈజీగా రీచ్ అయ్యేలా టైటిల్ ఉండాలని సలహా ఇచ్చారు. పైగా దిల్‌రాజు పేరు సినిమా ఇండస్ట్రీలో తెలియని వారు లేరు. ఆయన పేరుతో ఒక విధంగా మంచి ప్రచారం లభిస్తుందని ఆశిస్తున్నాం. ఇదే విషయాన్ని ఆయనకు వివరించేందుకు అపాయింట్మెంట్ కోరాం. ఆయన బిజీగా ఉండటంతో అది సాధ్యపడటం లేదు. త్వరలోనే దిల్‌రాజును కలిసి ఫొటో దిగాలని ఉంది. దర్శకుడు ఎ.వెంకటేష్‌తో వరుసగా మరో రెండు చిత్రాల్లో నటించనున్నాను. వీటిలో ఒకటి 'దిల్ రాజ'. మరొకటి షూటింగ్ దశలో ఉంది. మూడో చిత్రం ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఎన్నో విజయవంతమైన చిత్రాలను తెరకెక్కించి, పలు విజయాలు చూసిన దర్శకుడు కావడంతో నేను ఆయనన్ను నమ్ముకున్నాను. భారమంతా ఆయనపై వేశాను. మీడియా, ప్రేక్షకులు ఆదరిస్తే ఒక గుర్తింపు తెచ్చుకుంటా. కేవలం హీరోగా మాత్రమే కాదు.. ఇతర పాత్రలు వచ్చినా నటిస్తా' అని విజయ్ సత్య వివరించారు.

వింటేజ్ లుక్‌లో అజిత్ కుమార్

● 'విడాముయర్చి' నుంచి అప్‌డేట్

మగిళ్ తిరుమేని దర్శకత్వంలో అజిత్ కుమార్ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం 'విడాముయర్చి'. ఇందులో అజిత్ వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ విషయంపై ఆ చిత్రం నుంచి తాజాగా మరో లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఎంతో యంగ్‌గా, చార్మింగాగా కనిపిస్తున్నారు. ఈ మూవీలో ప్రతినాయకుడి పాత్రను యాక్షన్ హీరో అర్జున్ పోషిస్తుండగా, త్రిష, రెజీనా కెసాండ్రా, ప్రియా భవానీ శంకర్, ఆరవ్ తదితరులు ఇతర పాత్రలను పోషిస్తున్నారు. బడా నిర్మాత సుభాస్కరన్ లైకా ప్రొడక్షన్స్ బ్యానరుపై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. షూటింగ్ అజర్‌బైజాన్, ఉత్తరాదిలోని పలు అందమైన లోకేషన్లలో జరుపుతున్నారు. గత కొన్ని రోజులుగా అజిత్ సాల్ట్ అండ్ పెప్పర్, తెల్లటి గడ్డంతో కనిపిస్తున్న విషయం తెల్సిందే. తాజాగా విడుదల చేసిన పోస్టరులో అజిత్, త్రిష ఎంతో అందంగా కనిపిస్తున్నారు. ఇందులో నల్లటి వెంట్రుకలతో తనకే సొంతమైన వింటేజ్ లుక్‌లో కనిపిస్తుండటంతో ఆయన అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.


'విడాముయర్చి'లో అజిత్ - త్రిష

త్వరలో రవాణా శాఖలో అన్ని పోస్టుల భర్తీ

● మంత్రి శివశంకర్ ప్రకటన


కన్నియాకుమారిలో కొత్త బస్ సర్వీసులను జెండా ఊపి ప్రారంభిస్తున్న రవాణా శాఖ మంత్రి శివశంకర్

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటినీ వీలైనంత త్వరగా భర్తీ చేయనున్నట్లు ఆ శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. కన్నియాకుమారి సమీపం మార్తాండంలో శనివారం ఉదయం జరిగిన కార్యక్రమంలో 23 కొత్త బస్సులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో మరో మంత్రి మనో తంగరాజ్, ఎంపీ విజయ్ వసంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శివశంకర్ మాట్లాడుతూ.. రవాణా శాఖలో పాత బస్సులను తొలగించి 7700 కొత్త బస్సులను నడుపునున్నామన్నారు. ఆ బస్సుల కొనుగోలుకు నిధులు కూడా మంజూరయ్యాయని చెప్పారు. వారంలోగా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 300 కొత్త బస్సులు నడుపుతామని తెలిపారు.

విద్యార్థుల్లో అపార ప్రతిభ

● కోవై కలెక్టర్ క్రాంతికుమార్


టెలిస్కోప్ నిర్మాణ వర్క్‌షాప్‌లో కలెక్టర్

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అపారమైన ప్రతిభా పాటవాలున్నాయని, వాటిని వెలికి తీసేందుకు అవసరమైన వాతావరణాన్ని కల్పిస్తే, వారు జ్ఞానసముపార్జనలో దూసుకెళ్తారని కోయంబత్తూరు కలెక్టర్ క్రాంతికుమార్ పేర్కొన్నారు. వాకరూ ఫౌండేషన్, రోటరీ ఈ-క్లబ్ ఆఫ్ మెట్రో డైనమిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల ముదుక్కరైలో జరిగిన కార్యక్రమంలో ఆరు పాఠశాలల కోసం రూపొందించిన టెలిస్కోప్ నిర్మాణ వర్క్‌షాప్ కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాకరూ డైరెక్టర్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిమెడ్ డైరెక్టర్ రాజేష్ మాథ్యూ కురియన్ తదితరులు కూడా పాల్గొన్నారు.

కుట్రాలంలో పెరిగిన పర్యాటకుల రద్దీ


కుట్రాలం జలపాతం వద్ద స్నానం చేస్తున్న పర్యాటకులు

చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతాల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనడంతో శనివారం ఉదయం నుంచే పర్యాటకుల రద్దీ పెరిగింది. కుట్రాలం ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం, సిట్రరువి, పులియరువి జలపాతాల వద్ద వందల సంఖ్యలో పర్యాటకులు స్నానం చేయడానికి బారులు తీరారు. కుట్రాలం ప్రధాన జలపాతం వద్దకు కుటుంబ సమేతంగా వెళ్లిన పర్యాటకులు స్నానం చేయడానికి పోటీపడ్డారు. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉండటం, దానికి తోడు తరచూ చిరుజల్లులు కురవటంతో ఈ జలపాతాల వద్ద చల్లటి వాతావరణం నెలకొంది. దీనితో పర్యాటకుల సంఖ్య అధికమై అక్కడి హోటళ్లు, తినుబండారాల దుకాణాలు పండ్ల దుకాణాలలో వ్యాపారాలు జోరుగా సాగాయి.

రెండో రోజూ 16 విమానాల రద్దు

● 30 విమానాల రాకపోకల్లో జాప్యం

పెరంబూర్, జూలై 20: స్థానిక మీనంబాక్కం విమానాశ్రయంలో శుక్రవారం నుంచి ప్రపంచస్థాయిలో మైక్రోసాఫ్ట్ విండోస్‌లో ఏర్పడిన సాంకేతికలోపం కారణంగా శనివారం రెండో రోజు కూడా 16 విమానాలు రద్దయ్యాయి. అలాగే, మరో 30 విమానాలు పలు గంటలు ఆలస్యంగా నడిచాయి. దీంతో, ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా శుక్రవారం నుంచి విమాన సేవలతో పాటు పలు శాఖల్లో మైక్రోసాఫ్ట్ విండోస్ పని చేయకపోవడంతో అన్నిరకాల సేవలు స్తంభించాయి. దీంతో, విమానాశ్రయంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి విమాన సేవలు స్తంభించాయి. ఈ విమానాశ్రయంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు 32 విమానాలు రద్దు చేశారు. అలాగే, 60కి పైగా విమానాలు పలు గంటలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లాయి. దీంతో, విమానాశ్రయ అధికారులతో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు. ఈ నేపథ్యంలో, శనివారం రెండో రోజు కూడా చెన్నైకి రావాల్సిన 8 విమానాలు, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన మరో 8 విమానాలు అని మొత్తం 16 విమానాలు రద్దయ్యాయి. అలాగే, లండన్, సింగపూర్, కౌలాలంపూర్, దుబాయ్, కువైట్, అబుదాబీ, దోహా, శ్రీలంక తదితర విదేశీ విమానాలు, ఢిల్లీ, ముంబై, కోల్‌కాతా, పుణె, అండమాన్, తిరువనంతపురం, కొచ్చిన్, తిరుచ్చి, మదురై తదితర స్వదేశీ విమానాలు అని మొత్తం 30 విమానాలు బయలు దేరి వెళ్లడంలో జాప్యం చోటుచేసుకుంది. అదే సమయంలో మైక్రోసాఫ్ట్ విండోస్ సాంకేతిక ఇబ్బంది కొంత తగ్గిందని, ఇంటర్నెట్ సేవలకు తరచూ అంతరాయం కలుగుతుండడంతో కొంత జాప్యం జరిగిందని విమానాశ్రయ సిబ్బంది చెప్పారు. శనివారం సాయంత్రానికి కల్లా విమానసేవలు యధావిధిగా జరుగుతాయని అధికారులు ప్రకటించారు. కాగా, శుక్రవారం సర్వర్లు పనిచేయకపోవడంతో విమానాశ్రయ సిబ్బంది ప్రయాణికులకు చేతిరాతతో బోర్డింగ్ పాస్‌లు అందించగా, శనివారం కంప్యూటర్ ద్వారా అందజేశారు.


చెన్నైలోని క్యాంపు కార్యాలయంలో సీనియర్ పోలీసు ఉన్నతాధికారి ఇరా తిరునావుక్కరసు పోటీ పరీక్షలపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించి డీజీపీ శంకర్‌జివాల్‌కు అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

శుక్రవారం రాష్ట్ర కార్మిక సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి కె.వీరరాఘవ్‌రావు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సచివాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయిన దృశ్యం



శాస్త్రోక్తంగా వారాహి సర్వ కార్యసిద్ధి పూజ


పూజల్లో నిర్వాహకులు, భక్తులు

పెరంబూర్, జూలై 20: ఆషాడ శుక్రవారాన్ని పురస్కరించుకొని తమిళనాడు ఆర్య వైశ్య మహిళా సభ (మద్రాస్ యూనిట్) ఆధ్వర్యంలో శ్రీ వారాహి సర్వ కార్య సిద్ధ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక బ్రాడ్‌వే సమీపంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరిగిన కార్యక్రమానికి మహిళా సభ చైర్‌పర్సన్ అనిత రమేష్, సెక్రటరీ లక్ష్మీశశి కర్లపాటి, కోశాధికారి వసుంధర సుంకు సమక్షంలో వేద పండితుడు దిలీప్‌కుమార్ నేతృత్వంలో ఈ పూజలు నిర్వహించారు. తొలుత వారాహి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న సుమారు 200 మంది మహిళా భక్తులు సంప్రదాయ వస్త్రాలు ధరించిన వారాహి అమ్మవారి చిత్రపటం ముందు దీపాలు వెలిగించి దీప పూజ నిర్వహించారు. అనంతరం దిలీప్‌కుమార్ వారాహి పూజ విశిష్టత, ఆ పూజల వల్ల కలిగే మంచి ఫలితాలు వివరించారు. ఇలాంటి పూజలతో సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు లభించడంతో పాటు జ్ఞానం సిద్ధిస్తుందని, శత్రు నాశనం జరిగి ప్రతి పని విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా సభ చైర్‌పర్సన్ అనిత రమేష్ మాట్లాడుతూ... తమ సంస్థ తరఫున యేటా ఆషాడ మాస తొలి శుక్రవారం పూజలను శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో నిర్వహిస్తున్నామని కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ వారాహి, శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల ఆశీస్సులుంటాయని తెలిపారు. సభ కార్యదర్శి లక్ష్మీశశి మాట్లాడుతూ... లోక సంక్షేమం కోసం ఈ పూజలు నిర్వహించామన్నారు. తొలుత తెలుగు తరుణి మహిళా సభ్యుల బృందం వారాహి అమ్మవారిని, వాసవీ మాతను కీర్తిస్తూ భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. ఈ సందర్భంగా సభ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు కోశాధికారి వసుంధర తెలిపారు. ఈ పూజల్లో పెద్దసంఖ్యలో మహిళా సభ సభ్యులు, మాజీ చైర్‌పర్సన్లు పాల్గొన్నారు.